# 'వైండింగ్ కవి'

అదొక మెట్లకింద జాగా... ఖాళీగా ఉంచేయడమెందుకని ఆ బిల్డింగ్ యజమాని దానివరకు గోడ కట్టి ముందుభాగానికి షట్టర్ వేసి దాన్నో చిన్ని బడ్డీకొట్టు సైజు దుకాణంగా మార్చాడు.

ఆ చిన్నసైజు దుకాణం మా మద్దూరునగర్ మెయిన్ రోడ్డు మీదికుంది.

నేను అటూయిటూ తిరుగుతున్నప్పుడు ఆ చిన్న దుకాణం ముందు అయిదారు పాత టేబిల్ ఫ్యాన్లూ... రిపేరీకి వచ్చిన ఎయిర్ కూలర్లూ... కాలిపోయిన మోటార్లు రీవైండింగ్ చేస్తూ ఓ బక్కపల్చటి నల్లటి కుర్రవాడూ కలిసిన చిత్రం కనిపించేది. ఆ కుర్రాడితో నాకెప్పుడూ పనిపళ్లేదు. అందునా ఆ షాపు పెద్ద చింతచెట్టు దాపుకుండేది. ఉండేది అనెందుకంటున్నానంటే... ఇప్పుడు రోడ్డు విస్తరణ సాకుతో ఆ పెద్ద చింత చచ్చిపోయింది.

మా కర్నూలులో ఈ మధ్య సాహితీ చైతన్యం బాగానే ఉంటోంది. ఓ పదిహేనుమంది యువ సాహితీ మిత్రులు కలిసి వారానికో రెండువారాలకో సాహిత్య చర్చవేస్తూ వాళ్లు రాసిన, ప్రచురించిన కథలు చదువుతూ... వాటిని విశ్లేషించుకుంటూ వస్తున్న సాహిత్యమ్మీద అభిప్రాయాలు వెలిబుచ్చుకుంటూ వుంటారు.

వాళ్లందరూ రెండు సంవత్సరాల క్రితం ప్రతి రచయితా యింత అని డబ్బు వేసుకుని 'కథా సమయం' అన్న కథల సంకలనం తీసుకొచ్చారు. అసందర్భంగా పుస్తకావిష్కరణకు నాకు ఆహ్వానం అందించాడు మిత్రుడు వెంకటకృష్ణ.

ఆ సంకలనంలోని రచయితలందర్నీ పరిచయం చేస్తూ యితను వెంకటేష్ అని నేను చెప్పిన మోటార్ రీ-వైండింగ్ కుర్రాణ్ణి పరిచయం చేసాడు. ఆశ్చర్యపోయి... ఆప్యాయంగా చేయి కలిపి శుభాకాంక్షలు తెలిపా.

ఆశ్చరపోవడమెందుకూ మోటార్ రీ - వైడింగ్ చేసేవాడు సాహితీ సృజనకారుడు కాకూడదా అని మీరడగవచ్చు. నా మటుకు నేను ఆర్థిక స్థితి సృజనా రెండూ ఒకదానితో ఒకటి ముడిపడి వుంటాయి అనే అనుకుంటాను. (నా అభిప్రాయం మీద నాకు హక్కు ఉంటుంది కదా)

ఆ పుస్తకావిష్కరణ తర్వాత వెంకటేష్‌తో పరిచయం బాగా పెరిగింది. ఎప్పుడైనా

అటువెళ్తూ తీరిక దొరికితే ఆ అబ్బాయి దుకాణం దగ్గర కాసేపు కూచోడం మొదలయ్యింది. గోడకు నీట్‌గా అమర్చిన స్పానర్ల సెట్టు...వైండింగ్ వైర్ల చుట్ట. షెలాక్ వాసన, వీటితో కలిపి శబ్దరత్నాకరం మరికొన్ని పుస్తకాలు ఓ మూల... చిన్న బుట్టలో అన్నం క్యారియరూ నీళ్ళసీసా... ఓ ప్యాడుకు క్లిప్పుతో తెల్లకాగితాలు.

తీరిక దొరికితే ఆ చిన్న దుకాణంలో కూచునే అతను కథలు, కవితలు రాస్తాడు. ఇప్పటికి ఓ పన్నెండు పదిహేను కథలూ ఓ ఇరవై దాకా కవితలూ వివిధ పత్రికల్లో ప్రచురించాడు. అతనికి నేనంటే అభిమానం. మొన్న ఓ కాగితాల కట్టతో నా దగ్గరకొచ్చి... "సార్! వివిధ పత్రికల్లో పడ్డ కవితల్ని చిన్న సంకలనంగా వేయాలనుకుంటున్నాను. మీరు ముందుమాట రాసి పెట్టాలి" అనడిగాడు...తీసుకున్నా.

'ఒకతడి... అనేక సందర్భాలు' అని శీర్షిక పెట్టాడు వెంకటేష్. ఆ శీర్షికే బాగా ఆకర్షించింది. లోపల కవితలు బాగున్నాయి.

కొన్ని పంక్తులు ఎంత బావున్నాయంటే... రాత్రెప్పుడో గుర్రమెక్కి కవి మిత్రులు ధేనుకొండ శ్రీరామమూర్తికి ఫోన్జేసి మరీ చదివి వినిపించా.

మీకూనూ... ఓ పసిపాపపై రాసిన కవితలో కొన్ని వాక్యాలు।

వద్దంటే వినకుండా
చినుకుల పరిమళాల్ని ఒళ్లంతా రాసుకుని
ఇల్లంతా వాన పువ్వై గంతులేస్తుంది
......
రాల్తున్న రాత్రిపూలపై
ఏ పసిడి కలో కంటూ
ఉండుండి అధరాలపై
వెండి నవ్వును పూయిస్తుంది.

* * *

***నేనతని ఫోన్నంబరు డయిరీలో రాసుకుంటూ అతని పేరు పక్కన వైండింగ్ రచయిత అన్రాసుకున్నాను. అతనదే పేరుతో పబ్లిష్ చేద్దామనుకుంటున్నాడు. ఆలోచించండి 'వైండింగ్ కవిత' పేరెలా వుందో.*** ●